క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే ధనలక్ష్మి పర్యటన

రంపచోడవరం: మండలంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సోమవారం పర్యటించనున్నారు. ఐ.పోలవరం వద్ద నిర్మించిన పార్కును మధ్యాహ్నం ఒంటి గంటకు ఎమ్మెల్యే ప్రారంభిస్తారని పార్టీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం 2:30 గంటల నుంచి బందపల్లి గ్రామ పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, గ్రామ సచివాయల సిబ్బంది హాజరు కావాలని కోరారు.

రేపు రాజవొమ్మంగిలో 'గడప గడపకు'

రాజవొమ్మంగి: మండలకేంద్రం రాజవొమ్మంగిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరవుతారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు ఆటల పోటీలు


ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

దుంబ్రిగుడ: మండలంలోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం కథలు, ఆటల పోటీలు నిర్వహించారు. శాఖా గ్రంథాలయాధికారి శెట్టి సునీత ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, ఆటలు, పాటలు నిర్వహించి, విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామన్నారు. వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గోతిలో పడి పశువు మృతి


గోతిలో పడి మృతి చెందిన పశువు

అనంతగిరి: మండలంలోని వేంగడ పంచాయతీ దాలింపుట్టు గ్రామంలో జియో టవర్ పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగా టవర్‌కు కేబుల్‌ను వేసేందుకు, రోడ్డు ఆనుకుని, తవ్విన గోతిలో ఆదివారం ప్రమాదవశాత్తూ పడిన పశువు మృత్యువాత పడింది. కేబులు వేసేందుకు గోతులు తవ్వి విడిచిపెట్టడంతో పశువు మృతి చెందినట్లు గిరిజన రైతు సొంటారి అప్పన్న ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, దుక్కి సమయంలోని పశువు మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపించాడు.

300 మందికి వైద్య సేవలు

మారేడుమిల్లి: తూర్పుగోదావరి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి కమ్యూనిటీ హాల్ వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో రాజమండ్రికి చెందిన డాక్టర్లు జి.రామరావు, బి.శాంతదేవి, వై.రామకృష్ణ, ప్రియా, అరవింద్‌లు చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధులకు సంబంధించి 300 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నేడు దివ్యాంగులకు మోటార్ సైకిళ్లు పంపిణీ

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అందుబాటులోకి తెచ్చిన మోటార్ సైకిళ్లను సోమవారం కలెక్టరేట్‌లో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పంపిణీ చేస్తారని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పదవుల్లో ఉన్న పెద్దలు, పార్టీ నాయకులంతా తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు.

ప్రజా సేవకు ప్రాధాన్యం

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఆదివారం జై దుర్గమ్మ తల్లి టెంటు సప్లయర్స్ మండల యూనియన్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా గణేశ్వరరావు, కార్యదర్శిగా గంగన్న, కోశాధికారిగా చంద్రశేఖరరావుతో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు గణేశ్వరరావు, గంగన్న మాట్లాడుతూ ప్రజా సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. టెంటు సప్లయర్స్ ద్వారా ఉత్తమ సేవలందించాలన్నారు.

దశాబ్దాల కల.. నెరవేరనున్న వేళ

- 30 గ్రామాలకు తీరనున్న రవాణా కష్టాలు
- గింజర్తి కాలువపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభం
- త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు


పునాది కోసం తీసుకువచ్చిన చిప్స్, ఇసుక


వంతెన నిర్మాణ పనులు

కొయ్యూరు: మన్యంలోని చాలా ప్రాంతాలకు రహదారులు లేక గిరిజనులు నానా అవస్థలు పడేవారు. వర్షం కురిస్తే ఉధృతంగా గెడ్డలు ప్రవహిస్తుండడంతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. సరైన రహదారులు లేక రవాణాకు గిరిజనులు ఇబ్బందులు పడేవారు. అత్యవసర సమయాల్లో కూడా అంబులెన్స్ సేవలు అందక గిరిజనులు మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని గత టీడీపీ హయాంలో గిరిజనులు పలుమార్లు పాలకులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. అదంతా గతం... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మన్య ప్రాంతాభివృద్ధికి పెద్దపీట వేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏజెన్సీలోని శివారు గ్రామాల్లో కూడా రహదారులు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందు కోసం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నారు. ఫలితంగా మన్యంలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. ఏళ్ల తరబడి రహదారికి నోచుకోని అనేక గ్రామాలకు రోడ్లు, రవాణా సదుపాయం కల్పిస్తుండడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

వారధి పనులకు నిధులు

మండలంలోని ఆరు పంచాయతీలలో 30 గ్రామాలకు కీలకంగా మారిన వంతెన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గడచిన పది సంవత్సరాల నుంచి చింతలపూడి పంచాయతీ గింజర్తి కాలువపై గతంలో ఏర్పాటు చేసిన కల్వర్టు పూర్తిగా పాడైంది. ఈ కారణంగా వర్షాకాలంలో గెడ్డ దాటి వెళ్లలేక పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. ఉధృతి తగ్గే వరకు అవస్థలు తప్పేవి కావు. కాలువపై వంతెన నిర్మించాలని గత టీడీపీ హయాంలో పాలకులకు ఆయా గ్రామస్తులు పలుమార్లు వినతులు ఇచ్చినా మోక్షం కలగలేదు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గింజర్తి కాలువపై వంతెన నిర్మాణంపై అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రత్యేక దృష్టి సారించారు. వారు చొరవతో టీఎస్పీ(ట్రైబల్ సబ్ ప్లాన్)నిధులు రూ.80లక్షలు మంజూరయ్యాయి. దీంతో కొద్ది రోజుల నుంచి కాంట్రాక్టర్ పనులు చేపట్టారు.

తీరనున్న ఇక్కట్లు

మండలంలో ఆడాకుల, ఆర్.కొత్తూరు, బాలారం, కంఠారం, కొమ్మిక బకులూరు పంచాయతీల్లో 30 గ్రామాలకు చెందిన గిరిజనులు బొర్రంపేట, గింజర్తి మీదుగా కొయ్యూరు వస్తారు. ఇక్కడ కల్వర్టు పూర్తిగా పాడైపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. ప్రస్తుతం గింజర్తి కాలువపై వంతెన పనులు శరవేగంగా జరుగుతున్నాయి.వంతెన నిర్మాణానికి అవసరమైన ఇసుక, చిప్స్ ఇతరత్రా సామగ్రి ఇప్పటికే చేరుకుంది. వంతెన పూర్తయితే ఆరు పంచాయతీలకు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఉండవని, ఇబ్బందులు తీరుతాయని ఆయా గ్రామస్తులు చెబుతున్నారు. మండల కేంద్రానికి వచ్చేందుకు దూరం కూడా తగ్గిపోతుందని, ఏ కాలంలో అయినా ఇబ్బందులు లేకుండా ప్రయాణం చేయవచ్చని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు



వంతెన నిర్మాణం త్వరిగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కాంట్రాక్టర్ పనులను వేగంగా చేస్తున్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారు. పనులు త్వరగా పూర్తి చేసి వంతెనను అందుబాటులోకి తీసుకొస్తాం.

– ఈశ్వరరావు, ప్రాజెక్ట్ డీఈ, పీఆర్, కొయ్యూరు

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట


కులపాడు రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, కులుపాడుకు ఏళ్ల నాటి కల నెరవేరిందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని ములియపుట్టు పంచాయతీ ఆయన ఆదివారం పర్యటించారు. ఈ నేపథ్యంలోని గూడ రోడ్డు నుంచి కులుపాడు మీదుగా పెదబయలు రోడ్డు వరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.64లక్షల వ్యయంతో నిర్మించిన నూతన బీటి రోడ్డును ఎమ్మెల్యే పాల్గుణ శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో శివారు గ్రామాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రోడ్లు నిర్మాణాలు చేపడుతోందన్నారు. గ్రామల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కులుపాడులో గతంలో రహదారి సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడేవారని గతంలో టీడీపీ పాలకులు కనీసం పట్టించుకోలేదని గుర్తు చేశారు. అయితే జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ఎంపీపీ కూడా రాజుబాబు, వైస్ ఎంపీపీ ఒంటుబు ప్రియాంక, వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షుడు ఒంటుబు శామ్యూల్, సొసైటీ బ్యాంకు చైర్మన్ కె.రామకృష్ణ, కన్వీనర్ సింహాచలం, సర్పంచ్ చంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

మానసాదేవికి ప్రత్యేక పూజలు

అడ్డతీగల: జేష్ట శుద్ధ పౌర్ణమి (ఏరువాక పౌర్ణమి) పురస్కరించుకుని అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలో ఆదివారం మానసాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవనగిరి వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ లంకా అయ్యప్పశర్మ పౌరోహిత్యంలో పూజాధికాలు జరిపారు. అమ్మవారికి అభిషేకం నిర్వహించి మంత్ర పుష్పాలతో నవావర్చన నిర్వహించారు. చాలా విశిష్టత కలిగిన ఏరువాక పౌర్ణమి రైతులకు సాగుకి ముందు ఎంతో ప్రాధాన్యత ఉందని పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య అన్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా వ్యవసాయ పనులు ప్రారంభించి పంటలు పండిస్తారన్నారు. దీని వల్ల ప్రకృతిమాత పులకిస్తుందన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష అర్చనలు

శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఆదివారం విశేష అర్చనలు నిర్వహించారు. తొలిత స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకం అమ్మవార్లకు కుంకుమ పూజ జరిపించారు. అనంతరం సుబ్రహ్మణ్య హోమం నిర్వహించారు. నవగ్రహ మండపారాధన నీరాజన మంత్ర పుష్పాలతో గావించారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో వ్రతాలు


సత్యనారాయణస్వామి వ్రతాలను చేస్తున్న భక్తులు

సాక్షి,పాడేరు: స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అన్నవరం సత్యనారాయణ స్వామి సాముహిక వ్రతాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రామం పంతులు సత్యనారాయణస్వామి వ్రతాల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాడేరు ప్రాంతంలోని అన్ని వర్గాలకు చెందిన 50 మంది దంపతులు సత్యనారాయణస్వామి వ్రతం జరిపించుకున్నారు. అనంతరం భక్తులకు భారీఅన్నసమారాధన నిర్వహించారు. భక్తులకు స్వామివారి రాగి ప్రతిమలను వితరణ చేశారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు, ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహచలంనాయుడు, ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు ఉప్పల వెంకటరత్నం, శివరాత్రి నాగేశ్వరరావు, శివరాత్రి శ్రీనివాస్, సిద్దనాతి కొండలరావు, కొట్టగుళ్లి రామారావు, దాసరి నాగు, శివ, వెయ్యాకుల సత్యనారాయణ పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమం

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి


గంగవరం మండలం మోహనాపురంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను గ్రామస్తులకు అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

గంగవరం : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడప గడపకు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలో లోతట్టు గిరిజన గ్రామమైన మోహనాపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో 182 గడపలను సందర్శించారు. ఎమ్మెల్యే ధనలక్ష్మి మోహనాపురం గ్రామ సర్పంచ్ అక్కమ్మ, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను ఎమ్మెల్యే ధనలక్ష్మి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గంలో 140 సచివాలయాలు ఉండగా ఇప్పటి వరకు 72 సచివాలయాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. గంగవరం మండలంలో 17 గ్రామ పంచాయతీలకు గాను నెల్లిపూడి పంచాయతీ మినహా మిగిలిన 16 గ్రామ పంచాయతీ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రభుత్వ పథకాల అమలపై ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని గడప గడపలో విశేషమైన స్పందన లభిస్తుందన్నారు. గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు గడప గడపకు మన ప్రభుత్వ నిధులను మంజూరు చేస్తున్నామన్నారు. మోహనపురం గ్రామంలో మహిళలు తాగునీటి సమస్య, వీధి కుళాయిల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కొంతమందికి భూమి ఎక్కువగా ఉన్నందున పలు ప్రభుత్వ పథకాలు అందలేదని తెలిపారు. భూములు మ్యూటేషన్ చేయించుకోవాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. పలు సమస్యలను అధికారులతో చర్చించి అక్కడిక్కడే పరిష్కరించారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వెంకటలక్ష్మి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, ఏటి సిద్దేశ్వరరావు, ఎస్ఐ చినబాబు, సర్పంచ్‌లు కురసం అక్కమ్మ, బి.రామలక్ష్మి, నాగబాబు, ఉపాధి ఏపీఓ కృష్ణంరాజు, మండల పార్టీ ఇన్‌చార్జి సీహెచ్.రఘునాథ్, మండల సచివాలయ కన్వీనర్ మాగంటి శ్రీను, నాయకులు రమణ, రాంబాబు, మద్దేటి రామకృష్ణారెడ్డి, వీరబాబు, శ్రీను, వీఆర్వో అప్పలకొండ, కార్యదర్శి చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా పాకలపాటి గురుదేవుల జన్మదిన వేడుకలు


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

జి.మాడుగుల: మండల కేంద్రంలోని పాకలపాటి గురుదేవుల జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా భక్తిశ్రద్ధలతో జరిగాయి. గురుదేవుల ఆలయంలో పాకలపాటి గురుదేవుల భక్తుల అధ్యక్షుడు, రాష్ట్ర వైఎస్సార్‌టీఎఫ్ ప్రధాన కార్యదర్శి మత్స్యరాస మత్స్యరాజు దంపతులు హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పురవీధుల్లో పాకలపాటి గురుదేవులను భక్తిశ్రద్ధలతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిలి సద్గురు ఆశ్రమం ప్రతినిధి సాయిరాం స్వామిజీని ఘనంగా సన్మానించారు. సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపీటీసీలు మత్స్యరాస విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, వైఎస్సార్‌సీపీ నాయకులు పెదబంగ్రరాజు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదమ్మ తల్లి ఉత్సవాలు ప్రారంభం


ఘటాల ఊరేగింపులో భక్తులు


భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న భక్తులు

సాక్షి, పాడేరు: మండలంలోని నక్కలపుట్టులోని మోదమ్మ తల్లి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం, ఘటాలను ఊరేగించి, సతకంపట్టులో ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాక్షి,పాడేరు: మోదకొండమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.భక్తులు మొక్కులు సమర్పించారు. ఐటీడీఏ ఉద్యోగి డోకుపర్తి ప్రసాద్ దంపతులతో పాటు, అతని కుమారుడు వర్తక సంఘం నేత డోకుపర్తి రామకృష్ణలు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. పాడేరు వర్తక సంఘం నేత డోకుపర్తి అప్పలరాజు(మందులశెట్టి) జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

క్రికెట్ పోటీల విజేతలకు అభినందనలు


ట్రోఫీతో విజేతగా నిలిచిన జడ్డంగి టీమ్, నిర్వాహకులు


ట్రోఫీతో విజేతగా నిలిచిన శాంతినగరం జట్టు

రాజవొమ్మంగి: గిరిసీమ క్రికెట్ టోర్నీ విజేతగా జడ్డంగి టీం నిలచింది. మండలంలోని జడ్డంగిలో సర్పంచ్ కొంగర మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఏప్రిల్ 30న క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైన సంగతి విదితమే. కాగా ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో లాగరాయి టీంపై జడ్డంగి టీం గెలిచినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నీలో 48 టీంలు పాల్గొన్నాయి. అనంతరం జరిగిన అవార్డు ప్రధానోత్సవంలో జడ్డంగి ఎస్ఐ షరీఫ్ పాల్గొని విజేతలకు ట్రోఫీ అందజేశారు. గెలుపొందిన జడ్డంగి టీమ్‌నకు రూ.15,000, ట్రోఫీ, మెడల్స్ అందజేశారు. రన్నర్ టీమ్‌కు రూ.10,000 టోఫీ, మెడల్స్ బహూకరించారు. కాగా గెలుపొందిన జడ్డంగి టీం సభ్యులు జడ్డంగి లూథరన్ ఎయిడెడ్ పాఠశాల అభివృద్ధికి రూ.10వేలు బహూకరించింది. సర్పంచ్ మురళీకృష్ణ తన వంతు సహాయంగా పాఠశాలకు మరో రూ. 5వేలు, ఎస్ఐ షరీఫ్ పాఠశాలకు అవసరమైన ఫ్యాన్లు, ఇతర ఎలక్ట్రికల్ సామగ్రి అందజేశారు. సింగిరెడ్డి రవి, వార్డు సభ్యులు సత్తిబాబు, రాజుబాబు, స్థానికులు రవి, లాలిబాబు, బాబులు, కరుణ, రాము, నాగేశ్వరరావు, శ్రీను తదతరులు తమ సహాయ సహకారాలు అందజేశారు. ఈ సందర్భంగా విజేత టీమ్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

క్రికెట్ విజేత శాంతినగరం

కొయ్యూరు: రేవళ్లలో అల్లూరి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో శాంతినగర్ జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా రేవళ్ల టీమ్ నిలిచింది. టోర్నీలో మొత్తం 18 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన కార్యక్రమంలో విజేత జట్టుకు ఎం.వి.ఎస్. ప్రసాద్‌చేతుల మీదుగా రూ.10వేలు, కప్‌ను, రన్నర్ జట్టుకు రూ.5వేలు అందజేశారు. రేవళ్ల సర్పంచ్ వెంకటలక్ష్మి, కొయ్యూరు సర్పంచ్ బాలరాజు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం

కొయ్యూరు: అడవి బిడ్డలకు విద్యాదానంలో భాగంగా ఉత్తమ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న దుమంతి సత్యనారాయణ ఆధ్వర్యంలో బూదరాళ్ల పంచాయతీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 18 మంది విద్యార్థులను ఘనంగా సత్కరించారు. మండలంలోని గోధుమలంక, వంతమర్రి, పోకలపాలెం, పిట్లపాడు, పోతవరం, బాలరేవుల, గ్రామాలకు చెందిన విద్యార్థులకు శాలువా కప్పి సన్మానించారు. ఉన్నత చదువులు చదివి మరిన్ని ఉత్తమ ర్యాంకులు సాధించి, జిల్లా, మండల ఖ్యాతిని మరింత పెంచాలని ఆయన ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. సహచర విద్యార్థులు ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సంజీవ్, అరవింద్, నరేష్, దుమంతి భరత్, కిలో లక్ష్మణ్, కొర్రా రమణ, పాతును వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


రహదారికి అడ్డంగా పడిన చింతచెట్టు

ఎటపాక: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పడిన చింతచెట్టు ప్రమాదభరితంగా ఉంది. గత ఐదు రోజుల క్రితం గాలి దుమారానికి గన్నవరం, గౌరిదేవిపేట మధ్యలో ప్రధాన రహదారిపై చింత చెట్టు కూలి రహదారిపై పడింది. దీంతో రహదారి సగం వరకు మూసుకుపోయింది. భద్రాచలం నుంచి కూనవరం వెళ్లే ఈ ప్రధాన రహదారిలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రోజులు గడుస్తున్నా ఈ చెట్టును తొలగించేందుకు అధికారులు పట్టించుకోవడం లేదని వాహనచోదకులు చెబుతున్నారు. రాత్రి సమయంలో ఆందోళన చెందుతున్నామంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ప్రమాద భరితంగా ఉన్న కూలిన చెట్టును వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


భక్తులకు కంచాలను అందజేస్తున్న స్వామిజీ

జి.మాడుగుల: మండలంలో గాంధీనగరం పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో భీమునిపట్నం సద్గురు సేవాశ్రమం, శ్రీహనుమ ఆశ్రమం శ్రీ సాయిరాం స్వామిజీ ఆధ్వర్యంలో ఆలయ వార్షికోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు చేశారు. భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. వేడుకలకు విచ్చేసిన భక్తులకు దుప్పట్లు, కంచాలు వితరణ చేశారు. భక్తిశ్రద్ధలతో కోలాటాలు, హరి భజన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ధార్మిక సేవ సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత


చాపగెడ్డలో అవగాహన కల్పిస్తున్న ఏపీఎఫ్‌డీసీ, అటవీ అధికారులు


జి.మాడుగులలో కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

గూడెంకొత్తవీధి: పరిసరాల పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా ఆచరించాలని ఏపీఎఫ్‌డీసీ రేంజ్ అధికారి వెంకటేష్ అన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో లైఫ్ పేరిట పర్యావరణ పరిరక్షణపై చాపగెడ్డలో గిరిజనులకు అవగాహన కల్పించారు. అడవుల సంరక్షణ, పాలిథిన్ నిషేదం వంటి వాటిపై వివరించారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి చిరంజీవి, ఫారెస్ట్ బీట్ అధికారి ఈశ్వరరావు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

జి.మాడుగుల: మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, వైవీఆర్ రూరల్ పబ్లిసిటీ ఆధ్వర్యంలో ఆదివారం పర్యావరణం కపాడుకుందాం– పాలిథీన్ బ్యాగులు తగ్గించుకొని మానవళి జీవితాలను మణుగురు పర్చుకుందామని కళాకారులు వై.గణేష్, రవితేజ, లక్ష్మి కళాజాతను ప్రదర్శించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు ప్లాస్టిక్ నివారణపై వీధి నాటికలు, జానపద గీతాలులతో వారు చైతన్య పర్చారు. గోనె సంచులు, గుడ్డ సంచులు వినియోగించాలని తెలిపారు. పాలిథిన్ కవర్లను మూగజీవాలు తిని మృత్యువాత పడుతున్నాయని అటువంటి ప్లాస్టిక్‌ను తరిమికొడుదాం, పర్యావరణాన్ని రక్షించుకుందాం అంటూ పిలుపునిచ్చారు.